కథ

భీమరాజు వెంకటరమణ

# గోవిందా! గోవింద!

సమయం సాయంత్రం నాలుగు గంటలు దాటింది. అప్పటి దాకా చెట్టు మీద కావ్‌కావ్ అని అరుస్తున్న కాకి అరవడం మానేయడమే కాకుండా చెట్టు మీద నుంచి ఎగిరిపోయింది. ఉత్సాహంగా ఆడుకుంటున్న రెండు వీధి కుక్కలు ఆడటం ఆపేసి దూరంగా వెళ్లిపోయాయి. ఈవినింగ్ షిఫ్ట్ అడుక్కోవడానికి వచ్చిన బిచ్చగాడు పక్కకు తిరిగి వేరే వీధిలోకి వెళ్లిపోయాడు. వీళ్లందరికీ ఇష్టం లేని దేదో జరగబోతున్నది, అదే వీరబాబు ఇంట్లో నుంచి బయటకు రావడం.

ఇంట్లో వాళ్లని ఎవరికీ పట్టెడు అన్నం పెట్టనీయడు. తను ఒక రూపాయి అయినా ముష్టి వెయ్యడు, కనీసం ఎంగిలి చేత్తో కాకిని తోలడం కూడా అతగాడు చెయ్యడు, అసలు అన్నం తిన్న తరువాత కంచం చెయ్యి రెండూ కడిగేసినట్లు ఉంటాయి కదా మరి! ఏ జీవి అయినా అతని ముఖం చూడ్డానికి ఎందుకు ఇష్టపడుతుంది?

గంట క్రితం అటక మీద ఉన్న ఒక పాత ఎయిర్ బ్యాగ్‌ని తీసి భార్యకిస్తూ ''దీన్ని త్వరగా శుభ్రం చెయ్యి బట్టలు సర్దుకోవాలి'' అన్నాడు. అతని భార్య రమాదేవి ఆ బ్యాగుని చచ్చిన ఎలుక తోక పట్టుకున్నట్లు వికారంతో పట్టుకొని ''దీన్ని ఇంకా ఎంత కాలం వాడతారండీ? చూడండి! ఎలా దుమ్ము కొట్టుకొని పోయిందో? అయినా రైల్వేలో ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తూ అదీ ఏసీ క్లాస్‌లో ప్రయాణం చేస్తూ ఇలాంటి బ్యాగ్ తీసుకెళితే తెలిసినవాళ్లెవరైనా చూస్తే ఎగతాళి చెయ్యరు?'' అడిగింది.

''ఓసి పిచ్చి రమా! ఈ బ్యాగ్ చరిత్ర నీకేమి తెలుసు? మా నాన్న నేను డిగ్రీ చదువుతున్నప్పుడు కొనిచ్చాడు, ఎన్ని ప్రయాణాలు విజయవంతంగా చేసిందనుకున్నావ్? డిగ్రీ కాగానే తిరుపతి ప్రయాణానికి, ఆర్ఆర్‌బి టెస్ట్‌కి వెళ్లడానికి, తరువాత రైల్వేలో ఇంటర్వ్యూకి, ఆ తరువాత ట్రైనింగ్‌కి, అంతెందుకు నిన్ను పెళ్లిచూపులు చూడటానికి కూడా ఈ బ్యాగే తీసుకొచ్చాను తెలుసా? అన్నిసార్లూ విజయాలే. అంతగా అచ్చొచ్చిందన్న మాట!'' అన్నాడు ఆ బ్యాగ్ వైపు కృతజ్ఞతగా చూస్తూ.

''అంతేలెండి! ప్రతీదానికి అచ్చొచ్చింది అని పేరు పెట్టి మీ పిసినారితనాన్ని కప్పిపుచ్చుకోవడమేగా! అయినా మనింట్లో ఏ వస్తువుకీ ఎక్స్‌పయిరీ డేటు ఉండదుగా మనం ఎక్స్‌పయిరీ అయ్యేదాకా! ఏం చేస్తాం ఖర్మ'' అంటూ ఆ బ్యాగ్‌ని వరండాలో పడేసి చీపురుతో బాదడం మొదలుపెట్టింది అలాగైనా దాని పీడ విరగడవుతుందని. ''అయ్యయ్యో! అదేమిటే అలా కాళ్లజెర్రినో బొద్దింకనో చంపుతున్నట్లు చీపురుతో కొడుతున్నావ్? బ్యాగ్ పాడైపోతుంది, సున్నితంగా గుడ్డతో శుభ్రం చెయ్యి'' అంటూ కేకలు పెట్టి మరీ చెప్పాడు.

''గోడకు తగిలించి ఉన్న వెంకటేశ్వరస్వామి ఫోటో చూస్తూ రమాదేవి ''చూశావుగా స్వామీ! మా ఆయన పిసినారితనం? నీవే కరుణించాలి'' అనుకున్నది మనసులో ''అలాగే! అతగాడి సంగతి నాకు తెలుసుగా! నేను చూసుకుంటాలే!'' అని స్వామి పటంలో నుంచి చెప్పినట్లు అనిపించింది ఆమెకు.

''ఒక్క రోజుకి కావల్సిన బట్టలు పెట్టుకొని తిరుపతికి బయలుదేరిన భర్తతో ''జాగ్రత్తగా వెళ్లి రెండు మొక్కులూ తీర్చిరండి'' అన్నది. సరేలే అన్నట్లు తలూపి అతను బయటకు నడిచాడు.

తిన్నగా మూరంపూడి సెంటర్‌కి వెళ్లి నిలుచున్నాడు వీరబాబు. అక్కడి నుండి రాజమండ్రి రైల్వే స్టేషన్‌కి వెళ్లాలంటే ఆటో అయితే ముప్పై రూపాయలు. రిక్షా అయితే ఇరవై రూపాయలు అవుతుంది. కానీ షేర్ ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. ఎందుకంటే అదయితే ఏడు రూపాయలే మరి. అదే కనుక లోకల్ ట్రైన్ ఉండి ఉంటే రైల్వే పాస్‌తో ఉచితం. అలా లేనందుకు ఎన్నోసార్లు రైల్వే వాళ్లని తిట్టుకున్నాడు. షేర్ ఆటో వచ్చి అది ఎక్కి ట్రాఫిక్‌లో నిదానంగా స్టేషన్‌కి చేరేసరికి తిరుపతి రైలు ప్లాట్‌ఫారమ్ నుండి బయలుదేరింది. పరిగెత్తి ఎలాగో ఎక్కి ఊపిరి పీల్చుకున్నాడు.

* * *

తిరుపతి స్టేషన్‌లో రైలు దిగి అక్కడే కాఫీ, టిఫిన్లు కానిచ్చి బయటకు వచ్చి ఎదురుగా ఉన్న భవనంలో దర్శనం కోసం సుదర్శనం టోకెన్ల క్యూ దగ్గరకు వెళ్లాడు. ఆ రోజు రద్దీ కాస్త తక్కువగా ఉండటం వీరబాబుకి కలిసి వచ్చింది. ఉచిత దర్శనం మధ్యాహ్నంకల్లా అయిపోతుందని తెలియడంతో పరమానందం కలిగింది. అరవై రూపాయల టికెట్ కొనకుండా మిగిలించుకున్నట్లే.

ఈల వేసుకుంటూ కొండమీదకు వెళ్లే బస్టాండుకి వచ్చాడు. టికెట్ కోసం క్యూలో నిలబడగానే జేబులో నుంచి డబ్బు తీయాలంటే బాధేసింది. ''స్వామీ! ఏడుకొండలవాడా! ఇన్నిన్ని పనులు చేయిస్తున్నావు, కొండపైకి కూడా రైలు వేయించుకోవచ్చు కదా!'' అని మనసులోనే నసిగాడు. పైకి క్రిందకి కలిపి టికెట్ తీసుకున్నాడు. నాలుగు రూపాయలు కలిసొచ్చింది. కొంత ఊరట. బస్సెక్కి కూర్చున్నాడు.

బస్సు సప్తగిరుల సుందర దృశ్యాలు చూపిస్తూ ఎక్కుతున్నది. వీరబాబు తన జుట్టును ఒకసారి తడుముకున్నాడు. ''నాకు గవర్నమెంటు ఉద్యోగం వస్తే తలనీలాలు ఇస్తానని మొక్కుకున్నాడు నాన్న. ఆయన తలనీలాలు మొక్కుకోవచ్చుగా?'' కాస్త చిరాకు పడ్డాడు. ఆయన పోయి మూడేళ్లయింది. భార్య ప్రోద్బలం మీద ఇన్నాళ్లకు బయలుదేరాడు.

సాటి భక్తులు బస్సులో నుంచి కనిపిస్తున్న లోయలు, జలపాతాలు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. వీరబాబు మాత్రం తన వేలుకి ఉన్న ఉంగరాన్ని తడువుతూ చూసుకుంటున్నాడు. కొడుకు పుడితే తన ఉంగరాన్ని హుండీలో వేస్తానని మొక్కుకుంది భార్య. ఆమె మొక్కు కూడా వీరబాబుకి నచ్చలేదు. ''ఉంగరం కంటే ఏదైనా తక్కువ మొత్తం మొక్కుకోవచ్చుగా! స్వామికేం తక్కువ'' అనిపించింది అతనికి.

స్వామివారి పాటలు వినపడుతున్నాయి. బస్సు కొండపైకి చేరింది. బస్సు దిగిన వీరబాబు నేరుగా కళ్యాణకట్ట క్యూలో నిలబడ్డాడు. జుట్టు పోతుందంటే ఏదోలా ఉంది. మళ్లీ పెరగాలంటే కనీసం అయిదారు నెలలు పడుతున్నది. ఎందుకో అతనికి అయిష్టంగా ఉంది. వెళ్లి క్షురకుడి ముందు కూర్చున్నాడు. అతను సరిగ్గా కత్తితో తలనీలాలు తీయటం మొదలుపెడుతుండగా అప్రయత్నంగా ''మూడు కత్తెర్లు చాలు'' అన్నాడు. అతను అలానే చేశాడు. అక్కడే స్నానం చేసి బయటపడ్డాడు వీరబాబు. దర్శనానికి కాస్త సమయం ఉంది కాబట్టి, దేవస్థానం వారి ఉచిత బస్సులో కొండమీద ఉన్న ప్రదేశాలన్నీ చూసి, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ దగ్గరకు చేరుకున్నాడు.

కాసేపటికే అందరినీ లోపలికి వదిలి కాంప్లెక్స్‌లోని ఒక హాలులో కూర్చోబెట్టారు. అక్కడ అందరూ ఎదురుగా ఏర్పరచిన టీవీలో స్వామివారి సేవలు, ఊరేగింపులు చూస్తూ ఆనందిస్తున్నారు. వీరబాబు మాత్రం చేతికున్న ఉంగరాన్ని చూసుకుంటున్నాడు.

కాంప్లెక్స్ నుండి భక్తులను దర్శనానికి వదిలారు. అందరూ గోవిందనామాలు పాడుకుంటూ పరుగులు పెడుతున్నారు. వీరబాబు కూడా వారిని

అనుసరించి గుడి ఆవరణలోకి చేరాడు. అక్కడ నుండి మొదలైంది హడావిడి. అల్లంత దూరాన్నుండే స్వామి కనబడుతున్నాడు. అందరూ గోవిందా అంటూ నమస్కారాలు పెడుతూ తోసుకుంటూ ముందుకు వెళుతున్నారు. వీరబాబు కూడా రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెడుతూ కోరికల లిస్టు గబగబా చదువుతున్నాడు. తనకి ప్రమోషన్, తన పిల్లవాడికి తను అనుకున్న కాన్వెంట్‌లో సీటు, తన భార్యకు ఉద్యోగం చేయాలనే బుద్ధి కలగటం లాంటివి ఎన్నో కోరికలు ఏకరువు పెట్టి స్వామిని దర్శించి బయటకు వచ్చాడు.

గుడి చుట్టూ తిరిగి చిన్నగా హుండీ లైనులో నిలబడ్డాడు. హుండీని సమీపించి అక్కడ నిలబడ్డాడు. ఎందుకనో ఉంగరం అందులో వెయ్యబుద్ధి పుట్టలేదు. ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు. వేలుకి పెట్టిన ఉంగరాన్ని తీస్తున్నట్లు అది బిగుతుగా ఉండి రానట్లు నటిస్తున్నాడు. అక్కడ ఉన్న సెక్యూరిటీ వ్యక్తి త్వరగా వేసి ఇవతలకు రమ్మంటున్నాడు.

వీరబాబు మాత్రం అక్కడే నిలబడిపోయాడు. పక్కనే లైనులో ఉన్న సాటి భక్తుడు ''ఏమిటండీ! ఏమైయింది?'' అడిగాడు. ''ఉంగరం వేలు నుండి రావడం లేదండీ'' అన్నాడు వీరబాబు. పక్కనే ఉన్న నామాలు పెట్టుకున్న మరో వృద్ధ భక్తులు ''అయితే ఒక పని చెయ్యండి. దాని విలువ ఎంతో అంత డబ్బు హుండీలో వేయండి సరిపోతుంది'' అని సలహా ఇచ్చాడు.

వీరబాబుకి అదేదో బాగానే ఉన్నట్టు అనిపించింది. కారణం? దాని విలువ ఇప్పుడు అయిదు వేలు ఉంటుంది. తన భార్య పెళ్లికాక ముందు ఎప్పుడో దాన్ని చేయించినందుకు మూడు వేలు అయిందని చెప్పినట్లు గుర్తు. కనుక మూడు వేలు వేస్తే సరిపోతుంది. మనసు సమాధానపడింది. రెండు వేలు మిగిలినట్లే కదా!

సంతోషంగా జేబులో నుంచి మూడు వేలు తీసి హుండీలో వేస్తుండగా తనతో పాటు పక్కన సలహా ఇచ్చిన భక్తుడు కూడా ''గోవిందా! గోవింద'' అని పెద్దగా స్వామి నామస్మరణ చేశాడు. అంతే! మూడు వేల రూపాయలతో పాటు ఉంగరం కూడా జారి హుండీలో పడిపోయింది.

వీరబాబు కంగు తిన్నాడు. కాసేపు ఏమీ అర్థం కాలేదు. అక్కడ ఏమీ అడగటానికి వీల్లేదు. ఒకసారి హుండీలో వేసినదానిని తిరిగి ఇవ్వరు. నివ్వెరపోయాడు. కాసేపు హుండీని చూస్తూ పక్కనే ఉన్న గట్టు మీద కూర్చున్నాడు. కోలుకోవడానికి అతనికి పావుగంట పట్టింది. ఇక చేయగలిగింది ఏమీ లేక పెద్దగా నిట్టూర్చి గుడి బయటకు వచ్చాడు.

యాంత్రికంగా వెళ్లి కొండ మీద నుండి కిందకు దిగే బస్సు ఎక్కి కూర్చున్నాడు. తన పిసినారితనానికి శాస్తి జరిగిందని అంతరాత్మ చెబుతున్నా ఏళ్ల తరబడి అలవాటైన మనసు కుదుట పడటం లేదు. బస్సు తిరుపతి చేరింది. బస్టాండు నుండి ఇప్పుడు రైల్వే స్టేషన్‌కి వెళ్లాలి. ఆటోవాడు పదిహేను రూపాయలు అడుగుతున్నాడు. ఇంక పావు గంట టైమ్ ఉంది. ''గట్టిగా నడిస్తే ఐదు నిముషాలు. ఇంత తక్కువ దూరానికి అంత డబ్బు దండగ. పైగా పోయిన మూడు వేలు పొదుపుతో జమచేయాలి'' అనుకొని చకచకా నడవడం మొదలుపెట్టాడు.

అతని లెక్క తప్పి స్టేషన్ చేరడానికి పావు గంట పట్టింది. రైలు అప్పటికే బయలుదేరింది. వచ్చేటప్పుడు రాజమండ్రిలో కూడా ఇలాగే జరిగింది.

అప్పుడు లాగే ఇప్పుడూ పరిగెడుతున్నాడు ఎక్కడానికి. కానీ రైలు వేగం పుంజుకుంది. చివరి బోగీ అయినా పట్టుకుందామని తనూ వేగాన్ని పెంచాడు. దాదాపు బోగీ తలుపు పట్టుకున్నంత పనిచేసి పట్టుతప్పి క్రింద పడి మూడు పాలికింతలు పెట్టాడు. రైలు వెళ్లిపోయింది. వీరబాబుకి పెద్దగా ప్రమాదమేమీ జరగలేదు గానీ తలకు చిన్న దెబ్బ తగిలింది. ఆ తగిలిన చోట రెండు మూడు కుట్లు వేయడానికి, ఇంకా తలలో ఎక్కడైనా దెబ్బలు తగిలాయేమో చూడటానికి డాక్టర్లు అతనికి గుండు గీయించవలసి వచ్చింది.

☆

